సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
శుక్రవారం । 6 । జనవరి । 2023



ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి కృషి చేయాలని ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. - 8లో



సైబర్ నేరగాళ్లపై ఉక్కుపాదం

లోన్‌యాప్ మోసాలకు పాల్పడిన పలువురు అంతర్‌రాష్ట్ర సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసినట్లు ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. - 8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
30.3/18.4

జిల్లాలో బుధవారం 18.4 – 30.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

జేసీఎస్ కో-ఆర్డినేటర్ల నియామకం

కడప కార్పొరేషన్ : జగనన్న సచివాలయం కన్వీనర్లు, గృహసారథుల కో-ఆర్డినేటర్లను వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటించింది. చల్లా మధుసూదన్‌రెడ్డి వైఎస్సార్ జిల్లాతో పాటు శ్రీసత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల సమన్వయకర్తగా.. పుత్తా శివ శంకర్‌రెడ్డి అన్నమయ్య జిల్లాతో పాటు ఎస్ఆర్ఎస్పీ నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, ప్రకాశం జిల్లాల సమన్వయకర్తగా వ్యవహరిస్తారు.

జెడ్పీ హైస్కూల్ తనిఖీ

ఒంటిమిట్ట(సిద్దవటం): మండలంలోని రాచపల్లె జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయుల హాజరును, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విద్యార్థులకు అందిస్తున్న జగనన్న గోరుముద్దను మెనూ ప్రకారం నిర్వహించాలని సూచించారు.

విద్యుత్ ఆధార్ సమస్యల పరిష్కారానికి 'కాల్‌సెంటర్



విద్యుత్ కాల్ సెంటర్ వద్ద ఏడీఈలు, ఏఈలు

కడప కార్పొరేషన్: ఆధార్ సంబంధిత విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్. నరసింహప్రసాద్ తెలిపారు. ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా ఆదేశాల మేరకు శంకరాపురంలోని విద్యుత్ కేంద్రంలో ఈనెల 2వ తేదీ నుంచి ఈ కాల్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీఈఈలు నాగముని స్వామి, పి. సుబ్రమణ్యం, చంద్రా నాయక్, ఏఈలు గోవర్ధన్, షకీల్ అహ్మద్ పాల్గొన్నారు.

ఉప్పొంగిన పాతాళగంగ

- గణనీయంగా పెరిగిన భూగర్భజలాలు
- మెట్ట ప్రాంతంలో కళకళలాడుతున్న పంట పొలాలు
- మూడేళ్లుగా ఒక్క కరువు మండలం కూడా నమోదు కాని వైనం
- పెరిగిన ఆహార ఉత్పత్తులు, ఆశించిన రీతిలో గిట్టుబాటు ధరలు
- రైతుల మోముల్లో కన్పిస్తున్న చిరునవ్వులు



నీటితో కళకళలాడుతున్న సీబీఆర్ డ్యాం

సాక్షి ప్రతినిధి, కడప: రాజులో సుగుణాలు ఉంటే రాజ్యం సుభిక్షంగా ఉంటుందనేది శ్రీరామచంద్రుడి కాలం నుంచి వస్తున్న నానుడి. అందుకు ప్రత్యక్ష ఉదాహరణగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తోంది. ముఖ్యమంత్రిగా నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనూ, ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాలంలో పాడి, పంటలతో రైతులు వర్ధిల్లుతుండటం అందుకు నిదర్శనం. గడిచిన ఐదేళ్లతో పోలిస్తే భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయి. బీడు భూములుగా దర్శనమిచ్చే మెట్ట ప్రాంతాలు భూమికి పచ్చాని రంగేసినట్లు దర్శనమిస్తున్నాయి. పల్లెల్లో తాగునీటి ఎద్దడి అనే సమస్యే ఉత్పన్నం కాలేదు. కరువు మండలం అనే ఊసే లేదు. ఇవన్నీ కూడా సుభిక్షానికి సంకేతాలుగా ఉన్నాయి.

- చంద్రబాబునాయుడు, కరువు కవల పిల్లలని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అనేక సార్లు బాహాటంగా విమర్శించారు. వాస్తవిక రికార్డులు అందుకు దర్పం పడుతున్నాయి. వైఎస్సార్ జిల్లాను పరిశీలిస్తే టీడీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల కరువు తాండవించింది. చంద్రబాబు ప్రభుత్వం గద్దె దిగిపోగానే వర్షాలు సమృద్ధిగా కురవడంతో పంట పొలాలు సాగులోకి వచ్చాయి. దిగుబడులకు సైతం ఆశించిన ధరలు లభిస్తుండడంతో రైతుల మోముల్లో చిరునవ్వు కన్పిస్తోంది. ఉద్యాన పంటల దిగుబడులు, ధరలు ఆల్‌టైమ్ రికార్డు స్థాయిలో ఉండిపోయాయి.

పెరిగిన భూగర్భజలాలు..

గత ఐదేళ్ల క్రితం జిల్లాలో 16.42 మీటర్ల లోతులో ఉన్న భూగర్భజలాలు ప్రస్తుతం 5.70 మీటర్ల పరిధిలో ఉన్నాయి. దాదాపు 11 మీటర్లు పైకి భూగర్భజలాలు వృద్ధి చెందాయి. మెట్ట ప్రాంత రైతులకు భూగర్భ జలాలు ప్రధాన వనరు కావడంతో పంటల సాగుకు ఎంతో యోగ్యకరంగా నిలిచాయి. మరోవైపు చంద్రబాబు సర్కార్‌లో ఐదేళ్ల కరువు తాండవించడంతో పెట్టిన పంటల దిగుబడి లేకుండా పోయింది. రైతులు వ్యయప్రయాసలకు లోనయ్యారు. జిల్లా మొత్తం 51 మండలాలు కరువు మండలాలుగా రెండుసార్లు ప్రకటించారు. మరో ఏడాది 48 మండలాలు కరువు మండలాలుగా గుర్తించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గడిచిన మూడున్నరేళ్లలో ఒక్క కరువు మండలం కూడా నమోదు కాలేదన్నది జగమెరిగిన సత్యం.

ఉద్యాన పంటలు అదుర్స్...

సకాలంలో వర్షాలు కురుస్తుండడం, భూగర్భజలాలు గణనీయంగా పెరగడంతో ఉద్యాన పంటల పట్ల రైతాంగం ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లా వ్యాప్తంగా 52,018 హెక్టార్లలో సాగులో ఉన్నాయి. ప్రధానంగా అరటి, చీనీ, బొప్పాయి ఇతర రాష్ట్రాలతోపాటు, విదేశీ ఎగుమతులు జిల్లా నుంచి భారీగా ఉన్నాయి. అరటి ఈ ఏడాది టన్ను ధర రూ.30 వేలు కూడా పలికింది. చీనీ పండ్లు ఇప్పటికీ టన్ను రూ.50వేలు పలుకుతున్నాయి. ఉద్యాన పంటలు జిల్లాలో కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ధాన్యం, పప్పు ధాన్యాలు, నూనెగింజల పంటల దిగుమతులకు కూడా ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతు మోములో చిరునవ్వు కన్పిస్తోంది.

ప్రభుత్వ చేయూతతో...

భూగర్భ జలాలు గణనీయంగా పెరిగిన కారణంగా పాడుబడిన బోర్లలో సైతం సాగునీరు లభించింది. మరోవైపు రైతు భరోసా ద్వారా రూ.1,053 కోట్లు జిల్లాలోని రైతాంగానికి దక్కింది. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటల నష్టం నిమిత్తం రూ.282 కోట్లు చెల్లించారు. పంటల బీమా ద్వారా రూ.737.27 కోట్లు ఇచ్చారు. ఇవన్నీ రైతుల సాగుబడికి ఎంతో ఉపయోగకరంగా నిలిచాయి.

తాగునీటి ఎద్దడి కోసం రూ.100 కోట్లు

టీడీపీ హయాంలో రూ.100 కోట్లకు పైగా తాగునీటి ఎద్దడి నివారణకు వెచ్చించాల్సిన దుస్థితి ఏర్పడింది. ట్యాంకర్లతో తాగునీరు సరఫరా నిమిత్తం దాదాపు రూ.86 కోట్లు చంద్రబాబు సర్కార్ చెల్లిస్తే, మరో రూ.14కోట్లు పెండింగ్ బకాయిలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెల్లించింది. ఇవే కాకుండా మరో రూ.2.5 కోట్లు ప్రైవేటు వ్యక్తుల బోర్లకు బాడుగ చెల్లించి నీరు సరఫరా చేశారు. ఇలాంటి దుస్థితి గడిచిన మూడేళ్లలో జిల్లాలో లేకపోవడం విశేషం.

2014-19 టీడీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ జిల్లాలో కరువు మండలాలు

ఏడాది	కరువు మండలాలు
2014-15	48
2015-16	51
2016-17	32
2017-18	15
2018-19	51

తాగునీటి సరఫరాకు ఖర్చు చేసిన వివరాలు

ఏడాది	గ్రామాలు	వెచ్చించిన మొత్తం (కోట్లలో)
2014-15	189	2.66
2015-16	692	12.45
2016-17	123	1.19
2017-18	301	15.71
2018-19	110	3.80
2019-20	892	50.64

భూగర్భ జలాల వివరాలు

ఏడాది	భూగర్భ జలాలు (మీటర్లు)	వర్షపాతం (మిల్లీ మీటర్లు)
2017	16.42	41.55
2018	14.66	19.27
2019	21.49	31.07
2020	14.22	62.94
2021	5.55	62.04
2022	5.70	64.05

రైతు ప్రభుత్వంగా కీర్తి



రైతులకు అవసరమైన అన్ని వసతులను సమకూర్చి రైతు ప్రభుత్వంగా కీర్తి గడిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతులకు అన్ని రకాల సలహాలు సూచనలు, ఎరువులు, విత్తనాలు అందిస్తున్నాం. ప్రకృతి వైపరీత్యాలతో పంటలకు నష్టం చేకూరితే తక్షణమే పరిహారం దక్కుతోంది. సాగుకు కావాల్సిన ఆర్థిక సహాయాన్ని అందిస్తూ భరోసా కల్పిస్తోంది. ఇవన్నీ కూడా గణనీయంగా సాగు విస్తీర్ణం పెరగడానికి కారణమయ్యాయి.
-అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి

అరటి ఎగుమతులు పెరిగాయి



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో అరటి ఉత్పత్తులు బాగా పెరిగాయి. అవకాశాలు మెరుగు పడడంతో రైతుల్లో అరటి సాగుపై ఆసక్తి పెరిగింది. అవసరమైతే నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజ్ అందుబాటులోకి రానుంది. గడిచిన మూడేళ్లు ధరలు కూడా బాగా ఉండడంతో ఉద్యాన పంటల రైతులు సంతోషంగా ఉంటున్నారు.
-భాస్కర్‌రెడ్డి, అరటి రైతు, పులివెందుల

భూగర్భ జలాలు పెరిగాయి



గతంలో వరుస కరువులు చూశాం. మూడేళ్లుగా సకాలంలో వర్షాలు కురుస్తుండడంతో భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయి. దీంతోపాటు కేసీ కెనాల్‌లో కూడా సకాలంలో నీరు వస్తుండడంతో పంటల సాగు పెరిగింది. సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. దాంతో మెట్ట ప్రాంతంలో ఎన్నడూ లేనంతా పంటలు సాగులోకి వచ్చాయి. పైగా కరువు ఊసే లేకుండా పోయింది.
-వీరభద్రారెడ్డి, రైతు, ఏటూరు గ్రామం, ఖాజీపేట మండలం

చంద్రబాబునాయుడు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఖరీఫ్, రబీ సీజన్లలో జిల్లాలో సాగులోకి వచ్చిన భూవిస్తీర్ణం (హెక్టార్లలో)

ఏడాది	ఖరీఫ్ సాధారణసాగు	సాగుబడి	రబీ సాధారణ సాగు	సాగుబడి
2014-15	1,73,253	1,08,678	2,00,637	1,44,182
2015-16	1,57,687	1,14,106	1,94,085	1,93,913
2016-17	1,23,320	1,49,458	1,88,668	1,35,725
2017-18	1,25,585	1,04,171	1,74,970	1,68,162
2018-19	1,33,556	75,301	1,72,929	1,65,641
2019-20	1,16,887	73,792	1,68,440	1,58,671
జిల్లాల పునర్విభజన తర్వాత సాగులోకి వచ్చిన వివరాలు				
2020-21	99,286	96,426	1,67,347	1,85,088
2021-22	98,495	1,01,590	1,57,719	1,55,182

ఆటలతో శారీరక, మానసిక వికాసం

- స్టెప్ సీఈఓ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆఫీసర్ సాయి గ్రేస్
- ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో అట్టహాసంగా ప్రారంభమైన స్పోర్ట్స్ అండ్ గేమ్స్

కడప ఎడ్యుకేషన్: ఆటలతో విద్యార్థులకు శారీరక, మానసిక వికాసం లభిస్తుందని జిల్లా స్టెప్ సీఈఓ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆఫీసర్ సాయి గ్రేస్ పేర్కొన్నారు. కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం జిల్లా నోడల్ ఆఫీసర్, ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి ఆధ్వర్యంలో రీజినల్ స్థాయి బాలికల 25వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2022-23 అట్టహాసంగా ప్రారంభమైంది. తొలుత స్టెప్ సీఈఓ సాయిగ్రేస్, పాలిటెక్నిక్ ఆర్‌జేడీ నిర్మల్‌కుమార్ ప్రియా, ఆర్‌జేడీ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటసుబ్బయ్యలు జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. స్టెప్ సీఈఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుతోపాటు ఆటలను దినచర్యగా అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓడీ రాఘవరెడ్డి, శ్రీనివాసరావు, సుధారాణి, దామోదరం, సుజాత పాల్గొన్నారు.

మొదటి రోజు 11 కళాశాలల నుంచి..

మొదటి రోజు స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో కడప, అన్నమయ్య జిల్లాలోని 11 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి సుమారు 180 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరికి వాలీబాల్, టేబుల్ టెన్నిస్ సింగిల్ అండ్ డబుల్, 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్ల పరుగుపందెం, షటిల్ పోటీలను నిర్వహించారు.



స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌కు జ్యోతి ప్రజ్వలన చేస్తున్న స్టెప్ సీఈఓ సాయిగ్రేస్

క్రీడల్లో ప్రతిభ కనబరిచేందుకు చక్కటి వేదిక శాప్‌లీగ్

కడప స్పోర్ట్స్:క్రీడల్లో చక్కటి ప్రతిభ కనబరిచేందుకు చక్కటి వేదిక శాప్ లీగ్ పోటీలు అని స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో శాప్‌లీగ్ పోటీల్లో భాగంగా జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు, ఎంపికలు నిర్వహించారు. డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎన్.వి.పి. అమృత్ రాజ్ మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 7,8 తేదీల్లో నెల్లూరు నగరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ శాప్‌లీగ్‌పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

త్వరితగతిన భూసేకరణ ప్రక్రియ

కలెక్టర్ విజయ రామరాజు

కడప సిటీ : జిల్లాలో జాతీయ రహదారుల కోసం చేపట్టిన భూ సేకరణకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ విజయ రామరాజు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న జాతీయ రహదారుల అభివృద్ధి పనులకు సంబంధించి భూ సేకరణపై గురువారం రాష్ట్ర రవాణా రోడ్లు, భవనాల శాఖ ప్రభుత్వ కార్యదర్శి పిఎస్ ప్రద్యుమ్న అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో సమీక్షించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తో పాటు జేసీ సాయి కాంత్ వర్మ హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అక్కడ హాజరైన అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఏఐ, ఆర్ అండ్ బి, రెవెన్యూ, భూసేకరణ, సర్వే ల్యాండ్స్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత అంశాలపై దృష్టి సారించాలి

టాప్ ఫోర్, టాప్ టెన్ ప్రాధాన్యత అంశాలపై దృష్టి సారించాలని, అలాగే ప్రజల నుంచి వచ్చిన గ్రీవెన్స్‌కు సంబంధించి గడువులోగా అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ విజయ రామరాజు అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి వివిధ అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తో పాటు జేసీ సాయికాంత్ వర్మ, డీఆర్వో గంగాధర్ గౌడ్ హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ కృష్ణయ్య, సీపీఓ వెంకట్రావు, జెడ్పీ సీఈఓ సుధాకర్ రెడ్డి, డీపీఓ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జేసీ తదితరులు

ఇళ్ల నిర్మాణంలో లోటుపాట్లు లేకుండా చర్యలు

జగనన్న హౌసింగ్ కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయరామరాజు క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, నగర కమిషనర్ జి.ఎస్.ఎస్.ప్రవీణ్‌చంద్, హౌసింగ్ పీడీ కృష్ణయ్యతో కలిసి జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణాల పురోగతిపై ఆర్డీఓలు, నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా అవగాహనతో లక్ష్యాన్ని అధిగమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు ధర్మచంద్రారెడ్డి, వెంకట రమణ, శ్రీనివాసులు, వెంకటేశు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణ భద్రత కూడా మీ బాధ్యతే

స్వీయ భద్రతతో పాటు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రజల ప్రాణాలను కాపాడే బాధ్యత కూడా మీపై ఉందని విద్యుత్ శాఖ అధికారులకు కలెక్టర్ విజయ రామరాజు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ మునిశంకరయ్య తో కలిసి కలెక్టర్ విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అగ్రికల్చర్, రెసిడెన్షియల్, కమర్షియల్ మొదలైన మూడు కేటగిరీల వారీగా సర్వీసు నిర్వహణ బాధ్యతలను ఎనర్జీ అసిస్టెంట్లు ప్రణాళిక ప్రకారం చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడ విద్యుత్ ప్రమాదాలకు తావు లేకుండా పర్యవేక్షించాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. జగనన్న హౌసింగ్ లే అవుట్లలో వచ్చే నెల నాటికి విద్యుత్ స్తంభాల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈలు, ఈఈలు, ఏఈలు, జేఈలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

8న జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

కడప స్పోర్ట్స్: కడప నగరం బాలాజీనగర్‌లోని యూత్ హాస్టల్ ప్రాంగణంలో ఈనెల 8వ తేదీన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నెహ్రూయువకేంద్రం జిల్లా కోఆర్డినేటర్ కె. మణికంఠ తెలిపారు. ఈనెల 12వ తేదీ స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకుని నిర్వహిస్తున్న యువజనోత్సవాల్లో భాగంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15 నుంచి 29 సంవత్సరాలలోపు వయసు గల యువత ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఆసక్తి గల యువత తమపేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9398391912 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బైకులోకి దూరిన పాము



బైకులోకి దూరిన పాము

బద్వేలు అర్బన్ : రోడ్డు పక్కన ఆపి ఉంచిన ఓ బైకులోకి పాము దూరి కలకలం రేపింది. బద్వేలు పట్టణం అబ్బరాతివీధికి చెందిన లక్ష్మీనారాయణ అనే యువకుడు గురువారం తన ద్విచక్ర వాహనంలో ఓ పని నిమిత్తం పోలీసుస్టేషన్ బయట వాహనాన్ని నిలిపి లోపలికి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి పెట్రోలు ట్యాంకర్ కిందిభాగంలో పాము ఉండటాన్ని గమనించాడు. సుమారు అరగంట పాటు కర్రతో బయటికి పంపే ప్రయత్నం చేసినప్పటికీ వెళ్ళకుండా అక్కడే తిష్ట వేసింది. ఈ దృశ్యాన్ని చూసేందుకు జనం గుమిగూడారు. అరగంట తర్వాత జనమంతా వెళ్లిపోవడంతో దానంతట అదే మురుగు కాలువ వైపు వెళ్లిపోయింది.

సౌమ్యనాథుడి గుడి.. రక్షణ కొరవడి..

- ఎర్రరాతితో ఆలయ నిర్మాణం
- దశలవారీగా కూలిపోతున్న రక్షణ గోడలు
- పరిరక్షించాలంటున్న భక్తులు

రాజంపేట: సాక్షాత్తు కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వెంకటేశ్వరస్వామిని పోలిన మూలవిరాట్టు.. ఎర్రరాతితో ఆలయ నిర్మాణం...అదే నందలూరు గ్రామంలోని సౌమ్యనాథాలయం.. చోళ, మట్లిరాజుల కళానైపుణ్యానికి అద్దం పట్టే ఈ కోవెలకు ఇప్పుడు రక్షణ కరువైంది. ఈ ఆలయానికి చుట్టూ ఉన్న ప్రాచీన ప్రహరీ కూలిపోతోంది. సౌమ్యనాథాలయం కట్టడాలు, ఆలయ నిర్మాణం కేంద్ర పురావస్తుశాఖ ఆధీనంలో ఎప్పటి నుంచో ఉన్నాయి. ప్రస్తుతం ఆలయ భద్రతపై అనేక అనుమానాలు పుట్టుకొస్తున్నాయి.

ఆలయ నిర్మాణం ఇలా..

విశాలమైన ప్రాంగణంలో, నాలుగు రాజగోపురాల మధ్య ఉన్న ఈ ఆలయం పది ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. ఈ ఆలయంలో 108 స్తంభాలుఉంటే, అన్నింటిపైన భాగవతం రచించి ఉండటం కనిపిస్తుంది. ఆ ఆలయం శిథిలమైపోగా 11వ శతాబ్దంలో కులోత్తుంగచోళుడు ఈ ఆలయ నిర్మాణానికి పూనుకున్నాడని, అలా పునఃప్రారంభమైన ఈ క్షేత్ర నిర్మాణంలో పాండ్య, కాకతీయ, విజయనగరాజులు సైతం పాల్గొన్నారని చరిత్ర చెబుతోంది.



రాతిగోడలపై ఉన్న ఇటుకల కట్టడం కూలిన దృశ్యం



ఇటీవల ఉత్తర గాలిగోపురం సమీపంలో కూలిన రక్షణ గోడలు

ఎర్రరాతిని ఉపయోగించే రక్షణ గోడలు: ఎర్రరాతిని ఉపయోగించే రక్షణ గోడలతో పాటు ఆలయ నిర్మాణం జరిగింది. దక్షిణ, ఉత్తర, తూర్పు గాలిగోపురాలను కలుపుతూ పెద్దఎత్తున రక్షణ గోడను నిర్మించారు. ప్రాచీన శిల్పులు రక్షణగోడలో కొంతభాగం పెద్దపెద్ద బండరాళ్లను ఉపయోగించారు. పైగాభాగంలో నాణ్యమైన సున్నపు ఇటుకలను అమర్చారు. ఆలయం కూడా ఈ ప్రహరీ మధ్యలో కనిపించకుండా కేవలం గర్భాలయం గోపురం కనిపించేదని పూర్వీకులు చెబుతున్నారు. ఇప్పుడు అంతర్భాగంలోని ఆలయం కనిపిస్తోంది. దీన్ని బట్టి రక్షణ గోడలు ఏ మేరకు ఎంతవరకు కూలిపోతూ వచ్చాయో ఇట్టే అవగతమవుతోంది.

ఇటుకలు ఉన్నంత వరకు కూలిపోతూ..

ఆలయం ప్రహరీ పూర్తిగా దెబ్బతినింది. మరికొన్ని చోట్ల పై భాగంలో ఉన్న ఇటుకల నిర్మాణం కూలిపోవడంతో మొండిగోడలతో దర్శనమిస్తున్నాయి. ఆలయ రక్షణ గోడలను ఇంతవరకు ఎక్కడా కూడా పునరుద్ధరించిన దాఖలాలు కనపించడం లేదు. కేవలం గాలిగోపురాలకు మరమ్మతులు చేపట్టారు. ఆలయం చుట్టూ ఉన్న రక్షణగోడలు బలహీనంగా కనిపిస్తున్నాయి.

కేంద్ర పురావస్తుశాఖ అధికారి ఏమంటున్నారంటే..

సౌమ్యనాథాలయ రక్షణగా ఉన్న ప్రహరీలో కూలిన కొంతభాగం పునరుద్ధరించాలంటూ నివేదిక పంపామని కేంద్రపురావస్తుశాఖ సీఏ (కన్జర్వేటర్ అసిస్టెంట్) అధికారి బాలకృష్ణారెడ్డి తెలిపారు.

మహిళా ఓటర్లే అధికం

- ఓటర్ల తుది జాబితా విడుదల
- జిల్లాలో మొత్తం ఓటర్లు 15,91,700 మంది
- పురుషులు 7,82,515
- మహిళలు 8,06,544
- ట్రాన్స్‌జెండర్లు 254
- సర్వీసు ఓటర్లు 2,387
- బద్వేలు మినహా జిల్లాలో మహిళా ఓటర్లే అధికం

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ట్రాన్స్‌జెండర్లు	మొత్తం ఓటర్లు
బద్వేలు (ఎస్సీ)	106598	105837	21	212456
కడప	127199	132422	99	259720
పులివెందుల	110024	1143391	15	224430
కమలాపురం	97071	99930	33	197034
జమ్మలమడుగు	120150	125152	25	245327
ప్రొద్దుటూరు	118205	123507	49	241761
మైదుకూరు	103268	105305	12	208585
మొత్తం	782515	806544	254	1589313

కడప సిటీ : ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ-2023 ప్రక్రియలో భాగంగా గురువారం జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో ఓటరు జాబితా ప్రచురణ ప్రతుల వివరాలను విడుదల చేశారు. జిల్లాలోని అన్ని కార్యాలయాల్లో ఈ జాబితాను అందుబాటులో ఉంచామని డీఆర్వో గంగాధర్‌గౌడ్ తెలిపారు. జిల్లా వాసులందరూ విధిగా తమ ఓటర్ల వివరాలను ఓటరు జాబితాలో తనిఖీ చేసుకోవాలని సూచించారు. మొత్తం సర్వీసు ఓటర్లు 2387 మందితో కలిపి జిల్లాలో 15,91,700 మంది ఉన్నారు.

మహిళలే కీలకం

వైఎస్సార్ జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు సంబంధించి బద్వేలు మినహా కడప, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు.



మేయర్‌ను పరామర్శించిన ఎంపీ


మేయర్ సురేష్ బాబుతో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, కడప మేయర్ కె. సురేష్ బాబును కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి పరామర్శించారు. గురువారం చిన్నచౌకులోని ఆయన స్వగృహానికి వె వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు.

ఎమ్మెల్యే ఫిర్యాదుపై విచారణ

ప్రొద్దుటూరు : కడప ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ గురుప్రభాకర్ గురువారం స్థానిక అటవీ శాఖ అధికారి కార్యాలయంలో విచారణ జరిపారు. ఇన్‌చార్జి ఫారెస్ట్ రేంజర్ దినేష్‌కుమార్‌రెడ్డి వాకర్స్‌కు ఇబ్బందులు కలిగిస్తున్నారని, అతనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని గత మంగళవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి స్వయంగా ఆ కార్యాలయానికి వెళ్లి విధి నిర్వహణలో ఉన్న సబ్ డీఎఫ్ఓ దివాకర్‌కు ఫిర్యాదు చేశారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు వచ్చే వాకర్స్‌ను ఇబ్బంది పెట్టడం తగదని, నెలవారి ఫీజు రూ.150 మాత్రమే వసూలు చేయాలని, పార్కింగ్ ఫీజు విధించొద్దని ఎమ్మెల్యే కోరారు. ఈ మేరకు గురుప్రభాకర్ వాకర్స్‌ను కార్యాలయానికి పిలిపించి జరిగిన సంఘటనపై విచారణ చేశారు. అలాగే ఫారెస్ట్ రేంజర్ దినేష్‌కుమార్‌రెడ్డిని విచారించారు. ఎమ్మెల్యే ఫిర్యాదు చేసిన వెంటనే ఆయన స్పందించిన తీరుపట్ల వాకర్స్ హర్షం వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్ నాగార్జున, అనిల్‌కుమార్, పలువురు విచారణలో పాల్గొన్నారు.

అగ్నిప్రమాదం.. ఆస్తినష్టం

బి.కోడూరు : మండలంలోని గంగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన బసిరెడ్డి సుబ్బారెడ్డికి చెందిన బోదకొట్టం గురువారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగడంతో ప్రమాదం జరిగింది. బద్వేలు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో రూ.లక్ష ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

సైబర్ నేరగాళ్లపై ఉక్కుపాదం

- వారి బ్యాంకు ఖాతాల్లోని రూ.79,13,38,133 నగదు గుర్తించి ఫ్రీజ్
- ఈడీకి సిఫారసు
- జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వెల్లడి


కేకేఎన్ అన్బురాజన్, జిల్లా ఎస్పీ

కడప అర్బన్ : 2022 సంవత్సరంలో పోలీసులు సైబర్ నేరగాళ్లపై ఉక్కుపాదం మోపారు. సైబర్‌నేరాలపై పోలీసుల దర్యాప్తు వివరాలను గురువారం జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఓ ప్రకటనలో తెలియజేశారు.పలువురు అంతర్‌రాష్ట్ర మోసగాళ్లను అరెస్ట్ చేశారు.బీమా పేరిట కరోనాతో మరణించిన వారికి ప్రభుత్వం నుంచి ఆర్థిక లబ్ధి అందజేస్తామంటూ ప్రజలను మాయ మాటలతో ఏమార్చి లక్షల్లో డబ్బులను కొల్లగొట్టిన సైబర్ మోసగాళ్లను కటకటాల వెనక్కి నెట్టారు. లోన్‌యాప్ మోసాలకు సంబంధించి రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన మోసగాళ్లను 14 మందితో పాటు, వారికి సహకరించిన మరో 8 మంది స్థానికులను అరెస్ట్ చేశారు. సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాల్లోని రూ.79,13,38,133 నగదును గుర్తించి ఫ్రీజ్ చేసి తదుపరి చర్యల కోసం ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్)కి సిఫారసు చేశారు.

■ లోన్‌యాప్, ఇన్‌వెస్ట్‌మెంట్ యాప్, బీమా, లాటరీ పేరిట అమాయక ప్రజలను మోసం చేస్తున్న పలువురు సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేసి రూ. 19,03,196 స్వాధీనం చేసుకున్నారు. 2022లో ఐ.టి చట్టం క్రింద 81 కేసులను నమోదు చేసి 58 కేసులను ఛేదించారు. 23 కేసుల దర్యాప్తు తుదిదశలో ఉన్నాయి. ఎన్‌సీఆర్‌పీ (నేషనల్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్) ద్వారా 1154 ఫిర్యాదులు రాగా, 1400 పరిష్కరించారు. 154 దర్యాప్తులో వున్నాయి.

సైబర్ క్రైమ్ విభాగం ఏర్పాటు

ఇటీవలి కాలంలో లోన్‌యాప్, ఇతర సైబర్ క్రైమ్ నేరాల బాధితులు ఎక్కువ అవుతున్నారని, అలాంటి వారి కోసం లోన్‌యాప్‌లపైన అవగాహన కల్పించడం, ఇలాంటి కేసులను ఛేదించేందుకు సైబర్ క్రైమ్ విభాగంతో పాటు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు.ఎవరైనా లోన్ యాప్ ద్వారా లోను తీసుకుని ఉండి వేధింపులకు గురవుతుంటే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో లేదా 1930, డయల్ 100 ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అనుకోని పరిస్థితుల్లో ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే తక్షణం నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌లో (ఎన్.సి.ఆర్.పి) నమోదు చేయాలని, వెంటనే సంబంధిత పోలీసు అధికారులు సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తారన్నారు. సోషల్ మీడియాలో ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, బాధపెట్టినా వెంటనే ఎన్‌సీఆర్‌పీలో ఫిర్యాదు చేయవచ్చని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సూచించారు.

■ పోగొట్టుకున్న ఫోన్‌ను బాధితులకు తక్కువ సమయంలో తిరిగి వారికి అప్పగిస్తామని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. బాధితులు ముందుగా 93929 41541 నంబర్‌కు వాట్సాప్ ద్వారా హాయ్.. అనే మెసేజ్ పెట్టగానే వెబ్‌సైట్ లింక్ ప్రత్యక్షమవుతుంది. వెంటనే అందులో ఉండే నమోదు ఫారంలో పోగొట్టుకున్న ఫోన్ వివరాలు, ఆధార్ కార్డు, ఐ.ఎం.ఈ.ఐ నంబర్‌తో ఉన్న బిల్లు, ప్రస్తుత కాంటాక్ట్ నంబర్‌లను పీడీఎఫ్ రూపంలో అప్‌లోడ్ చేయాలన్నారు. తదుపరి ఒక అక్నాలెడ్జిమెంట్ నెంబర్ వాట్సాప్‌లో వస్తుంది.దాని ద్వారా స్టేటస్ తెలుసుకోవచ్చనీ ఎస్పీ తెలిపారు. అప్‌లోడ్ వివరాలు జిల్లా ఎస్పీ కార్యాలయంలోని ప్రత్యేక టీమ్‌కు చేరతాయన్నారు.ప్రత్యేక పోలీస్ బృందాలతో పోగొట్టుకున్న మొబైల్‌ను తిరిగి బాధితులకు అందించేందుకు జిల్లా పోలీసుశాఖ చర్యలు చేపట్టిందనీ ఎస్పీ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

కడప అర్బన్ : కడపనగరంలోని బహుజననగర్‌లో నివాసం ఉంటున్న నాగరాజు (45) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కడుపునొప్పి తాళలేక ఈ చర్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. అతని భార్యశ్రీదేవి కువైట్‌లో ఉంటోంది. కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇంటిలోనే పురుగుల మందు తాగాడు. కుమార్తె గమనించి 108 వాహన సిబ్బందికి ఫోన్ చేయగా వారు వచ్చి అప్పటికే మృతి చెందినట్లు తెలియజేశారు. మృతుడి సోదరుడు రామాంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి

10న తలనీలాల వేలం పాట

సిద్దవటం : మండలంలోని శ్రీ నిత్యపూజ స్వామి దేవస్థానంలో మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి భక్తులు సమర్పించుకునే తలనీలాల పోగు హక్కు కోసం ఈనెల 10వ తేదీన ఉదయం 11 గంటలకు బహిరంగ వేలంపాట నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ కొండారెడ్డిలు తెలిపారు.గురువారం వారు మాట్లాడుతూ సిద్దవటంలోని రంగనాయక స్వామి ఆలయంలో వేలంపాట జరుగుతుందన్నారు. మహా శివరాత్రి ఉత్సవాలు వచ్చేనెల 17 నుంచి 19 వరకు మూడు రోజుల పాటు జరుగుతాయన్నారు. బహిరంగ వేలం పాటలో పాల్గొనే ప్రతి పాటా దారుడు ధరావత్తు కింద రూ.1,00,000 చెల్లించాలన్నారు.

ప్రచార యావతోనే చంద్రబాబు అలజడులు

ధ్వజమెత్తిన ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : ప్రచార యావతోనే చంద్రబాబు రాష్ట్రంలో పర్యటిస్తూ అలజడులు సృష్టిస్తున్నారని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి గురువారం ధ్వజమెత్తారు. మైదుకూరు మండలం శివపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు కేవలం తన ఉనికి కోసమే బహిరంగ సభలు నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలను హరిస్తున్నారని ఆరోపించారు. గోదావరి పుష్కరాలు మొదలు ఇప్పటివరకు తన ప్రచార యావకు పదుల సంఖ్యలో ప్రజలు బలైనా తన ధోరణి మార్చుకోలేదన్నారు. పర్మిషన్ లేక పోయినా రోడ్లు, ఇరుకు సందుల్లో సభలు నిర్వహిస్తూ అమాయకులను బలిగొంటున్నారని రఘురామిరెడ్డి ఆరోపించారు.

మండలాలు, మున్సిపాలిటీని కోల్పోయిన చంద్రబాబు కుప్పంలో ఓడిపోతాననే భయంతో అలజడులు సృష్టించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. రోడ్లపై బహిరంగ సభలను నిషేధిస్తూ ప్రభుత్వం తెచ్చిన జీఓపై పసలేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకొని ప్రజలకు ఇబ్బంది లేని విధంగా నడుచుకోకపోతే వారి చేతిలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

తమ్ముడిని హత్య చేసిన అన్నకు జీవితఖైదు


పగడాల నరేష్

రాజంపేట : వరుసకు తమ్ముడైన పగడాల అశోక్‌కుమార్‌ను హత్య చేసిన కేసులో అన్న పగడాల నరేష్‌కు జీవిత ఖైదు విధిస్తూ రాజంపేట మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి మురళీకృష్ణ గురువారం తీర్పు వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ నిజాంజానీ అందించిన వివరాల మేరకు ...2016లో కడప నగరం చెమ్ముమియాపేటకు చెందిన పగడాల అశోక్‌కుమార్ అదృశ్యమయ్యాడని అతని తల్లి వెంకటసుబ్బమ్మ ఫిర్యాదు చేసింది.ఈమేరకు కడప తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో తన పెద్దనాన్న కుమారుడు అశోక్‌కుమార్ దగ్గర డబ్బు ఉండి సాయపడలేదని కక్ష పెంచుకున్నాడు పగడాలనరేష్. మిత్రులు తిలక్, బంట్రోతు రాజశేఖర్ సహాయంతో తమ్ముడిని చంపేందుకు వ్యూహం రూపొందించారు. అతని డబ్బు, బ్యాంకు ఏటీఎం ద్వారా తీసుకోవాలని రాజంపేటలోని మహేంద్రఫైనాన్స్‌లో పనిచేస్తున్న తమ్ముడికి మాయమాటలు చెప్పి, పెనగలూరు మండలం ఇండ్లూరు గ్రామంలోని నదిలో గొంతుకోసి, ఇసుకలో పూడ్చివేశారు. అప్పట్లో ఈ సంఘటన సంచలనం కలిగించింది. ఈ కేసును రాజంపేట పోలీసులు దర్యాప్తు కొనసాగించారు. రాజంపేట మూడోఅదనపు జిల్లా కోర్టు లో విచారణ కొనసాగింది. నేరంలో ప్రథమ నిందితునిగా ఉన్న పగడాల నరేష్‌పైన హత్యకేసు రుజువైంది. దీంతో న్యాయమూర్తి మురళీకృష్ణ నరేష్‌కు జీవితఖైదు, రూ.7వేలు జరిమానా విధించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మహమ్మద్ నిజాంజానీ వాదించారు. సీఐ సదాశివయ్య, సీఐ మోహనకృష్ణ, సీఐలు అశోక్‌కుమార్ కేసు విచారణ చేపట్టారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా వీడియో పాఠాలు



మాట్లాడుతున్న ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్, శిక్షణకు హాజరైన అధ్యాపకులు

వైవీయూ : విద్యార్థులకు సరళంగా, సులువుగా అర్థమయ్యేలా వీడియో పాఠాలు రూపొందించాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం. రమేష్ పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలోని నోడల్ కేంద్రంలో వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల డిగ్రీ కళాశాల అధ్యాపకులకు ఇంటర్న్‌షిప్, వీడియా పాఠశాల రూపకల్పనపై శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ విద్యలో నూతన సంస్కరణలు ప్రారంభమైన నేపథ్యంలో వచ్చిన మార్పులకు తగిన విధంగా అధ్యాపకులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలని సూచించారు. నోడల్ రీసోర్స్ సెంటర్ సమన్వయకర్త డాక్టర్ పి. హరిప్రసాద్ మాట్లాడుతూ మూడురోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణలో ఉమ్మడి జిల్లాల పరిధిలోని అన్ని డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు వీడియో పాఠాల రూపకల్పనపై శిక్షణ ఇస్తామని తెలిపారు. అనంతరం ఇంటర్న్‌షిప్ కోఆర్డినేటర్ చక్రవర్తి ఇంటర్న్‌షిప్ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ డా. హరిబాబు, వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలను అందించాలి


వల్లూరు గ్రామ సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా

వల్లూరు : ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి కృషి చేయాలని ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. వల్లూరు ఎంపీడీవో కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయా శాఖలకు సంబంధించిన ప్రణాళికలు, ప్రగతి గురించి తెలుసుకున్నారు. అంకిత భావంతో సమష్టిగా పని చేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయడానికి కృషి చేయాలన్నారు. అనంతరం వల్లూరు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు.రికార్డులను పరిశీలించారు. శాఖల వారీగా సిబ్బంది విధులు, బాధ్యతల గురించి తెలుసుకుని, పలు సూచనలు అందించారు. సచివాలయ ఉద్యోగులు తప్పని సరిగా డ్రస్ కోడ్ పాటించాలన్నారు. రికార్డులను తప్పని సరిగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో రమణారెడ్డి, ఎంపీడీవో జుబేద, తహశీల్దార్ నారాయణరెడ్డి, ఈవో పీఆర్‌డీ ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యమే ముఖ్యమంత్రి లక్ష్యం


ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, అరవిందనాథరెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ /సింహాద్రిపురం: గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం విజయవాడలో వైఎస్సార్ జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, గౌరవాధ్యక్షుడు అరవిందనాథరెడ్డి సజ్జల రామకృష్ణారెడ్డిని కలిశారు. జిల్లాలో సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించి తక్షణమే పరిష్కరించాలని కోరారు.ఈమేరకు వినతి పత్రాన్ని సమర్పించారు.అన్ని గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. సర్పంచుల సమస్యలపై సజ్జల రామకృష్ణారెడ్డి సానుకూలంగా స్పందించారు. మౌలిక సదుపాయాలతో పాటు గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులు ప్రభుత్వం విడుదల చేస్తుందని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని విజయపథంలో నడిపించేందుకు సర్పంచులు కృషి చేయాలని కోరారు.

పెన్నానదికి నీరు విడుదల

జమ్మలమడుగు : గండికోట జలాశయం నుంచి మైలవరం ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ నీటిని అధికారులు పెన్నానదిలోకి విడుదల చేశారు. గురువారం ఉదయం నుంచి గండికోట జలాశయం నుంచి ఆరువేల క్యూసెక్కులు వస్తోంది. దీంతో మైలవరం జలాశయం నుంచి మూడువేల 200 క్యూసెక్కులు పెన్నానదిలోకి విడుదల చేశారు. పెన్నానది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలు


గాయపడిన దైవసహాయం

మైదుకూరు : మైదుకూరు పట్టణ శివారులో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో దైవ సహాయం అనే ఉపాధ్యాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. దువ్వూరు మండలం కానగూడూరు ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ హెడ్ టీచర్‌గా పనిచేస్తున్న ఈ అంధ ఉపాధ్యాయుడు ఉదయం తన సహాయకుడితో ద్విచక్రవాహనంపై పాఠశాలకు బయలుదేరాడు. మైదుకూరు శివారులోని శ్రీనగరం వద్ద జాతీయ రహదారిపై ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీ కొనడంతో ఉపాధ్యాయుడు దైవ సహాయం ఎగిరి రోడ్డుపై పడ్డాడు. తలకు తీవ్ర గాయాలయ్యాయి. ముందు వైపు ద్విచక్రవాహనంపై వెళుతున్న దువ్వూరు మండల సంగటి తిమ్మాయపల్లెకు చెందిన నాగశేఖర్‌రెడ్డి దంపతులకు స్వల్పగాయాలు కాగా ఉపాధ్యాయుని సహాకునికి ఎలాంటి గాయాలు కాలేదు. ఉపాధ్యాయుడు దైవసహాయాన్ని ప్రొద్దుటూరుకు తరలించారు. పరిస్థితి విషమించడంతో కర్నూలుకు తీసుకెళ్లారు.

కారు ఢీకొని..


గాయపడిన జీవరత్నం

గోపవరం : మండలంలోని గోపవరం ప్రాజెక్టుకాలనీ వద్ద నెల్లూరు - ముంబై జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే కాలనీకి చెందిన జీవరత్నంకు తీవ్ర గాయాలయ్యాయి. ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా బద్వేలు నుంచి నెల్లూరు వెళుతున్న కారు అతివేగంగా ఢీకొనడంతో జీవరత్నంకు కాలు, చేయి విరిగాయి. ప్రమాదానికి కారణమైన కారు ఆపకుండా వెళ్లిపోయింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది గాయపడిన వ్యక్తిని బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నోటి క్యాన్సర్‌ను గుర్తించే వెల్‌స్కోప్


వెల్‌స్కోప్ గురించి వివరిస్తున్న దంతవైద్యులు

కడప అర్బన్ : నోటిక్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించేది వెల్‌స్కోప్ అని కడప ప్రభుత్వ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సురేఖ అన్నారు. నేషనల్ ఓరల్ హెల్త్ ప్రోగ్రామ్ (ఎన్ఓహెచ్‌పీఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ. 7.50 లక్షల విలువైన ఈ వెల్‌స్కోప్ పరికరాన్ని మంజూరు చేసిందని ప్రిన్సిపాల్ తెలిపారు. గురువారం ఈ పరికరాన్ని వినియోగించే విధానంపై దంతవైద్యులకు ఓరల్ మెడిసిన్, రేడియాలజీ విభాగం వారు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణను ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సురేఖ ప్రారంభించారు. ఈ పరికరాన్ని కడపలోని ప్రభుత్వ దంత వైద్య కళాశాలకు అందించేందుకు కృషి చేసిన వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి(హెచ్ఎం అండ్ ఎఫ్‌డబ్ల్యూ) జి.ఎస్. నవీన్‌కుమార్‌కు, నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ జె. నివాస్, డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ వి. వినోద్‌కుమార్‌కు ప్రిన్సిపాల్, వైద్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్ఓహెచ్‌పీ కో- ఆర్డినేటర్ డాక్టర్ ఐ. రమేష్ కుమార్, డాక్టర్ మెర్సీ, డాక్టర్ సురేష్ వెల్‌స్కోప్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణకు 8 జిల్లాల నుంచి 85 మంది డెంటల్ అసిస్టెంట్ సర్జన్స్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ విద్యా విధానంతో ఉజ్వల భవిష్యత్తు


మాట్లాడుతున్న సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, చిత్రంలో డీఈఓ దేవరాజు

కడప ఎడ్యుకేషన్ : డిజిటల్ విద్యా విధానంతో విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి చెప్పలి దేవరాజు, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని విద్యామందిర్ స్కూల్లో జిల్లాలో సీబీఎస్ఈ ఎంపిక చేసిన 31 పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదటి రోజు శిక్షణా కార్యక్రమానికి డీఈఓ దేవరాజు, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యా విధానాన్ని అమలు పరచాలన్నారు. సీబీఎస్ఈ ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. అందువల్ల వాటిని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. "అనంతరం ఎస్‌సీఈఆర్టీ ద్వారా వచ్చిన రీసోర్సు పర్సన్స్ సాయికుమారి, రజనీచౌదరి, జిల్లా రిసోర్సు పరర్స న్స్ ఆపర్ణరెడ్డి, జ్యోతిలు సీబీఎస్ఈ ప్రాముఖ్యతను వివరించారు.డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, జిల్లా సమగ్రశిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి రామాంజనేయులరెడ్డి, జీసీడీవో ధనలక్ష్మి, కోర్సు కో- ఆర్డినేటర్ ప్రమీల పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

బద్వేలు అర్బన్ : తమ పిల్లలను నిష్కారణంగా కొట్టారంటూ గురువారం స్థానిక రజకవీధి ప్రాథమిక పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. వివరాలు..పాఠశాలకు సంబంధించి స్టేషనరీ మెటీరియల్ కనిపించలేదని బుధవారం పాఠశాలలోని ఇద్దరు ఉపాధ్యాయులు కొంత మంది విద్యార్థులను కొట్టినట్లు తెలిసింది. సాయంత్రం ఇంటికి వెళ్లిన విద్యార్థులు తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో వారు గురువారం మధ్యాహ్నం సమయంలో పాఠశాల వద్దకు చేరుకుని ఆందోళన చేశారు.పిల్లలను కొట్టాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. అయితే తాము పిల్లలను కొట్టలేదని, గట్టిగా మందలించామని, ఇకపై ఇలా జరగకుండా చూసుకుంటామని ఉపాధ్యాయులు సర్ది చెప్పడంతో తల్లిదండ్రులు వెనుదిరిగారు.

ప్రధానాపాధ్యాయుడి ఫిర్యాదు

పాఠశాలలోని ఓ విద్యార్థి తల్లిదండ్రులు తనపై దాడి చేశారని ప్రధానోపాధ్యాయుడు శేషఫణి గురువారం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.విద్యార్థి పేరు ఆన్‌లైన్ విషయమై తనపై విద్యార్థి తల్లి, మరికొందరు దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.అయితే విద్యార్థి తల్లిదండ్రులు ఆన్‌లైన్ విషయమై ప్రధానోపాధ్యాయుడితో మాట్లాడామే గానీ దాడి చేయలేదని చెప్పుకొచ్చారు. రెండు ఘటనలతో పాఠశాల వద్ద కొద్దిసేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులను విచారించి పంపించేశారు. సదరు విషయంపై ఇప్పటి వరకు కేసు నమోదు కాలేదు.